
సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 21 । డిసెంబర్ । 2023



రూ.450 కోట్లతో ఆలయాల అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం రూ.450 కోట్లతో పలు ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపడుతోందని దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. - 8లో



ఆలయంలో భారీ చోరీ

తమ్మినాయుడుపేట పరిధిలోని ఆలయంలో దొంగలుపడ్డారు. విలువైన ఆభరణాలు, హుండీకానుకలు అపహరించారు. - 8లో

నేడు హాకీ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్ : సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే ఈ ఎంపికలకు ప్రిన్సిపాళ్లు ధ్రువీకరించిన పత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

న్యాయవిద్యలో ప్రవేశాలకు తుదిషెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: న్యాయవిద్యలో ప్రవేశాలకు తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. గురువారం నుంచి ఈ నెల 23 వరకు రిజిస్ట్రేషన్, 26 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, ఈ నెల 27 నుంచి 29 వరకు ఆప్షన్ల ఎంపిక, ఈ నెల 30న ఆప్షన్ల మార్పుకు అవకాశమిచ్చారు. జనవరి 2న కళాశాల అలాట్‌మెంట్లు ప్రకటిస్తారు. జనవరి 3 నుంచి 5 మధ్య విద్యార్థులు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. వర్సిటీ లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 44 సీట్లకు గాను 22 మంది ప్రవేశాలు పొందారు. శ్రీకాకుళం ఎంపీఆర్ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 61 సీట్లకు 39, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 61 సీట్లకు ఐదు మాత్రమే భర్తీ అయ్యాయి. వర్సిటీలో ప్రవేశాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య సూచించారు.

ఆమె నేత్రాలు సజీవం




కార్నియాలను సేకరిస్తున్న టెక్నీషియన్

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో ఆశ్రయం పొందిన రెడ్డిక వెంకటలక్ష్మీ (65) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్ర కార్నియాలను సేకరించారు. గత ఏడాది ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద భిక్షాటన చేస్తూ నడవలేని స్థితిలో ఉన్న ఈమెను ఆసుపత్రిలో చేర్పి అనురాగ నిలయంలో వసతి కల్పించారు. బుధవారం ఆమె మరణించగా ఆమె నేత్రాల నుంచి కార్నియాలను టెక్నీషియన్ సుజాత సేకరించి ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈమె దహన సంస్కారాల ఖర్చును రెడ్‌క్రాస్ పేట్రన్ కల్యాణ్‌చక్రవర్తి చెల్లించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సాయిసుధాకర్, పవన్, తవుడు, గఫూర్ పాల్గొన్నారు.

● గజగజ..!







చలిపులి వణికిస్తోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా చలిగాలులు వీస్తుండటంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస సమస్యలు ఉన్న వారు చలికి తట్టుకోలేక పోతున్నారు. చల్లటి గాలులు, మంచు తీవ్రత నుంచి తప్పించుకునేందుకు స్వెట్టర్లు, ప్రత్యేక దుస్తులను ధరిస్తున్నారు. శ్రీకాకుళం నగర పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట చలితీవ్రత దృశ్యాలను చిత్రాల్లో చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అత్యున్నత ప్రమాణాలతో ఇంద్ర పుష్కరిణి

- వచ్చే జూలైలోగా అందుబాటులోకి..
- పునఃనిర్మాణ పనుల శంకుస్థాపనలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

అరసవల్లి : ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఇంద్రపుష్కరిణి పునఃనిర్మాణ పనులను రానున్న జూలైలోగా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. సీజీఎఫ్, దేవాలయ నిధులు రూ.4 కోట్లతో చేపడుతున్న పుష్కరిణి పునఃనిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లక్షలాది మంది పవిత్ర స్నానాలు చేసే పుష్కరిణి పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా కాంట్రాక్టర్లు బాధ్యతగా...ఇదో వరంలా భావించి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలోగా



భూమిపూజ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

పనులు పూర్తి అయితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఆలయం ప్రాకారం, మాడవీధులు, రహదారులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతకుముందు ఆదిత్యున్ని మంత్రి దర్శించుకున్నారు. ఈవో వి.హరిసూర్య ప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తుల వసతి కోసం దాతలు నిర్మించిన ఎనిమిది ఏసీ గదులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, రఘువర్మ, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆర్జేసీ సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ సుజాత, ఎస్ఈ జి.వి.ఆర్.శేఖర్, ఈఈ దుర్గేష్, డీఈ కృష్ణ, ఏఈ చందన, ఈవో సుకన్య, కేపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పెంచలరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, సోమేశ్వరరావు, కోటేశ్వర చౌదరి, గోవిందరావు, గనిరాజు, మైలపల్లి లక్ష్మీ, ద్వారపు అనూరాధ, జోగి మల్లెమ్మ, జె.శ్రీనివాస్, లోకేశ్వరి, రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు గంగు సీతాపతి, యామిజాల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

లావేరు: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన ద్వారా గ్రామీణ అభ్యర్థులకు ఎచ్చెర్లలోని టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. డిగ్రీ చదివిన 20 నుంచి 30 ఏళ్లలోపు గ్రామీణ మహిళలు, పురుషులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, ట్రైనింగ్ కిట్ అందిస్తామని చెప్పారు. కంప్యూటర్స్, ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఉంటుందని, వివరాలకు 91775 63253 నంబరును సంప్రదించాలని కోరారు.




ఐదుగురు విద్యార్థులకు రూ.39.79 లక్షలు

- జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద అందజేత
- సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కింద మరో ఇద్దరికి రూ.2.50 లక్షలు



విద్యార్థుల తల్లిదండ్రులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పేదరికం కారణంగా విదేశాల్లో ఉన్నత చదువులకు నోచుకోలేని విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం బాసటగా నిలుస్తోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా బుధవారం ప్రారంభించారు. జిల్లాలో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లో టాప్ 50 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇతర కోర్సులు చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం శత శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోందని, దీనిలో భాగంగా కెనడా, ఆస్ట్రేలియాల్లో చదువుతున్న ఐదుగురు జిల్లా విద్యార్థులకు మూడో విడతగా రూ.39.79 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరికి రూ.2.50 లక్షలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తం రూ.42,29,591 నమూనా చెక్కును అధికారులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఇంకా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్సులో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సాంఘిక సంక్షేమ శాఖ, ఉప సంచాలకులు వై.విశ్వమోహన రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.అనురాధ పాల్గొన్నారు.



క్లుప్తంగా

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపిస్తున్న పీడీ శాంతిశ్రీ

టెక్కలి రూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు దిగడంతో మూతపడిన కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు తెరిపిస్తున్నారు. గర్భిణులకు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందక అనారోగ్యాలకు గురవుతున్నారనే సమాచారం మేరకు బుధవారం ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ టెక్కలి పరిధిలోని శంభానవీధి, గోపినాథపురం, బీసీకాలనీ, చిన్నబ్రాహ్మణవీధి తదితర కేంద్రాలను సచివాలయ సిబ్బంది సాయంతో తాత్కాలికంగా తెరిపించారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు. అవసరమైతే సమీప ప్రభుత్వ పాఠశాలల నుంచి పౌష్టికాహారం అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

టెక్కలి నుంచి ఒడిశాకు బస్సు సర్వీసులు

టెక్కలి: టెక్కలి ప్రజా రవాణా డిపో నుంచి ఒడిశా రాష్ట్రం గుణుపూర్ ప్రాంతానికి బస్సు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి డిపో నుంచి ప్రతి రోజూ ఉదయం 11.45 గంటలకు బస్సు బయలుదేరి విశాఖపట్నం వెళ్లి, మరలా సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం, నరసన్నపేట, పర్లాఖిమిడి మీదుగా రాత్రి 10 గంటలకు గుణుపూర్ చేరుకుంటుందని పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గుణుపూర్‌లో బస్సు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖ చేరుకుంటుందని వివరించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో 'వలంటీర్' సందడి



ఎమ్మెల్సీపై సన్నివేశం చిత్రీకరిస్తున్న సినిమా బృందం

టెక్కలి: మండలంలోని జీడిపేట, భీంపురం గిరిజన గ్రామాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ లీలా ప్రొడక్షన్ సారథ్యంలో రాజు నిర్మాతగా, వడ్డే వెంకటేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వలంటీర్' సినిమాలో పలు సన్నివేశాలను బుధవారం జీడిపేటలో చిత్రీకరించారు. అవినీతిని ఎదుర్కొనే ప్రజల నాయకునిగా ఎమ్మెల్సీ దువ్వాడ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా గ్రామ వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేశారని, వారి సేవలను అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడుతూ, ప్రజలకు పూర్తి స్థాయిలో చైతన్యం కల్పించేందుకు ఈ చిత్రానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. విద్యా, వైద్యం, వ్యవసాయంతో పాటు నవరత్నాల విశిష్టతను తెలిపేలా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయిందన్నారు. జనవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ హాస్పిటల్ రోడ్డులోని డీఎల్‌టీసీ/ఐటీఐలో వివిధ స్వల్పకాలిక శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ వెల్డర్, మల్టీస్కిల్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన పురుషులు అర్హులని పేర్కొన్నారు. టైలరింగ్ కోర్సులో 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. ఈనెల 27లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో శిక్షణా కేంద్రం వద్ద సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఆర్ ఎస్‌ఐ కుటుంబానికి సాయం



చెక్ అందచేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో పనిచేసిన ఏఆర్ ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణ అక్టోబర్‌లో అనారోగ్యంతో మృతిచెందారు. ప్రభుత్వం అడిషనల్ కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష మంజూరు చేయగా ఆ చెక్కును సతీమణి జ్యోతికి ఎస్పీ రాధిక బుధవారం అందచేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

అసాధారణ సవరణలపై ప్రత్యేక దృష్టి

- ఈఆర్వోలు, ఏఈఆర్వోల సమీక్షలో ప్రత్యేక పరిశీలకుడు శ్యామలరావు
- నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాపై సమీక్ష



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న పరిశీలకుడు శ్యామలరావు. చిత్రంలో కలెక్టర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించిన అక్టోబర్ 27 నుంచి ఇప్పటి వరకూ చేసిన మార్పులు, చేర్పులు, ఇతర సవరణలపై ఏ కోణంలో ప్రశ్న వేసినా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలకుడు జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 26లోగా అన్ని క్లెయిములు పూర్తి చేయాల్సి ఉన్నందున ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఆ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ఇతర అధికారులు, బీఎల్వోలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 దరఖాస్తుల ఆధారంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అవలంబిస్తున్న విధానాలు, చర్యలపై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ శ్రీకేష్.లాఠకర్ పరిశీలకులకు వివరించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఓటర్లలో చైతన్యం కల్పించామని, యువ ఓటర్లను చేర్పించామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి తొలగింపులు, చేర్పుల ప్రక్రియను చేపడుతున్నామని, ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం పరిశీలకులు పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఈపీ(ఎలక్టోరల్ పాప్యులేషన్) రేషియో 750కి మించి ఉంటే మరోసారి విశ్లేషణ చేయాలన్నారు. అసాధారణ తొలగింపులు, చేర్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకటికి రెండు సార్లు విశ్లేషించుకోవాలని, రాజకీయ పార్టీల నుంచి వచ్చే వినతులపై సకాలంలో స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా పారదర్శక విధానాలు పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలలో నాలుగు శాతం కంటే అధికంగా నమోదైన చేర్పులు, తొలగింపులపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

దరఖాస్తులపై ఆరా..

సమావేశం అనంతరం ఓటర్ల జాబితా పరిశీలకుడు ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదుగురు బీఎల్వోలతో ప్రత్యేకంగా మాట్లాడారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో సేకరించిన ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిశీలించారు. ఏయే దరఖాస్తు ఎందుకు ఉంటుంది.. ఏయే చర్యలు చేపట్టాలి అనే అంశాలపై బీఎల్వోలను ప్రశ్నించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఈఆర్వోలు ఎస్.భరత్‌నాయక్, నూరుల్ కామర్, ఆర్.వెంకట్‌రామన్, సీహెచ్.రంగయ్య, బి.పద్మావతి, జి.జయదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.450 కోట్లతో ఆలయాల అభివృద్ధి



దుర్గమ్మ ప్రచార రథం వద్ద దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ

అరసవల్లి: హిందూ ధర్మ ప్రచారం, భావితరాలకు సనాతన ధర్మం విలువలను తెలియజేసే ప్రయత్నమే ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్రచార రథాల కార్యక్రమాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రచార రథం అరసవల్లి చేరుకున్న సందర్భంగా బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.450 కోట్లతో పలు ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు. అరసవల్లిలో సీజీఎఫ్ వాటాగా రూ.2 కోట్లు, శ్రీకూర్మం ఆలయంలో రూ.కోటి జీజీఎఫ్ నిధులతో పుష్కరిణి పనులకు కేటాయిస్తున్నామని వివరించారు. టీటీడీ వాణి ట్రస్ట్ ద్వారా 3600 కొత్త దేవాలయాల నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆలయాల భూముల అన్యాక్రాంతాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, తాజాగా భూ సర్వే ప్రక్రియలో ఆలయాల భూములను కాపాడుకునే అవకాశం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఆర్జేజీ సురేష్‌బాబు, డీసీ సుజాత, జిల్లా దేవదాయ శాఖాధికారి వి.హరి సూర్యప్రకాష్, దుర్గమ్మ ఆలయ అర్చకులు యజ్ఞనారాయణ శర్మ, ఆదిత్యాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం



కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేడీ శ్రీధర్

జి.సిగడాం: జిల్లాలో ఐదు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం మర్రివలస, జి.సిగడాం గ్రామాల్లో ఆర్‌బీకేలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఆరు వేల జీపీఎస్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు, నాలుగు రోజుల్లో సంబంధిత రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమవుతుందని చెప్పారు. ఈ ఏడాది రబీలో లక్షా 60వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. కట్టెజనుము, రాగులు, వేరుశనగ విత్తనాలు రాయితీపై అందించామన్నారు. కార్యక్రమంలో రణస్థలం ఏడీఏ వడ్డాది శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి యర్రా శారద, సర్పంచ్‌లు విక్రం కోటిబాబు, పున్నాన అక్కలనాయుడు, గేదెల మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు గేదెల నారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సింహాద్రి హరికృష్ణ, ముంతా హేమంత్, పొగిరి నారాయణరావు, పైడిచింతల కుమసు, అలుగోలు లక్ష్మినారాయణ, కుమరాపు సుగుణాకరరావు పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యున్నతి కృషి



కస్టమ్ హైరింగ్ సెంటర్లో యంత్రాలను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం వరప్రసాద్

సారవకోట: రైతుల అభ్యున్నతికి నాబార్డు కృషి చేస్తోందని నాబార్డు డీడీఎం కుప్పిలి వరప్రసాద్ అన్నారు. బుధవారం సారవకోట మండలం దాసుపురంలో బ్రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పలు రంగాల్లో శిక్షణ, రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లో గిరిజన రైతులకు పవర్ టిల్లర్, రోలర్, ఆయిల్ ఇంజిన్లు, డ్రమ్ సీడర్, కోనో మీటర్, సైకిల్ వీడర్, స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బ్రెడ్స్ సంస్థ మేనేజర్ సాంబమూర్తి మాట్లాడుతూ సంస్థ తరఫున సారవకోట, మెళియాపుట్టి, హిరమండలం, పాతపట్నం మండలాల్లో ఆరు గ్రామాల్లోని గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ తక్కువ అద్దెకే యంత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రెడ్స్ సిబ్బంది ఆనంద్, ఈశ్వరరావు, జె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి తెలుగు మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ, కమిటీ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: జనవరి 5 నుంచి 7 వరకు రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ పిలుపునిచ్చారు. ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం తెలుగు మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాష గొప్పతనం, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేందుకు సభలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యుడు రవికుమార్, తెలుగు బోధకులు పాల్గొన్నారు.

● గణితాకృతిలో..



నరసన్నపేటలోని మారుతీనగర్‌లో శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థులు మ్యాథ్స్ డే సందర్భంగా బుధవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. గణిత ఆంగ్ల అక్షర మాలలో కూర్చుని విద్యార్థులు ఆకట్టుకున్నారు. గణిత ప్రతిభా పరీక్ష విజేతలకు ఈ నెల 22న శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా బహుమతులు అందిస్తామని నిర్వాహకులు రామారావు తెలిపారు. -నరసన్నపేట

అవయవదాతకు అంత్యక్రియలు

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసకు చెందిన వ్యాపారి పొట్నూరు రాజేశ్వరరావు(50) బ్రెయిన్‌డెడ్‌కు గురికావడంతో మంగళవారం అవయవాలను దానం చేసిన సంగతి తెలిసిందే. మృతదేహానికి బుధవారం స్వగ్రామం రావివలసలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. భర్త అవయవదానానికి అంగీకరించిన భార్య నిర్మలను అభినందించారు.

ఆడుదాం ఆంధ్రాకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 26న ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్సుకు జిల్లా నుంచి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు. గ్రామ, సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, గ్రామ వార్డు సచివాలయ కోఆర్డినేటర్ వాసుదేవరావు, మెప్మా పీడీ కిరణ్, ఎస్.వై.కె యూత్ కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, చీఫ్ కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కొప్పల భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో నాడు-నేడు పనులు మొదలుకొని అనేక రకాల సమాచారాలు నిక్షిప్తం చేయడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తున్నారని, వారి శ్రమను గుర్తించి పనికి తగిన వేతనం ఇవ్వాలని, మినిమం టైమ్ స్కేల్‌ను వర్తింపజేయాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

చోరీల కేసులో ఐదుగురు అరెస్టు

టెక్కలి రూరల్ : డివిజన్ పరిధిలో కొద్దిరోజులుగా జరిగిన చోరీ కేసులకు సంబంధించి ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన గొల్లవెల్లి సంతోష్ రాజ్‌కుమార్, మెడిశెట్టి నాగరాజు, జి.పవన్‌కల్యాణ్, సంతబొమ్మాళి మండలం పాత మేఘవరం గ్రామానికి చెందిన నందుపల్లి సంతోష్‌కుమార్, కొత్తూరు మండలం దశరథిపురం గ్రామానికి చెందిన ఇసై రమేష్‌లు ఈ చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. సంతోష్‌రాజ్‌కుమార్ విశాఖపట్నం నుంచి కారు అద్దెకు తీసుకుని మిగిలిన సభ్యులతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించేవారు. అర్ధరాత్రి సంబంధిత ఇంటికి చేరుకుని తాళాలు బద్దలు గొట్టి చోరీకి పాల్పడేవారు. ఈ క్రమంలో టెక్కలి పరిధిలోని గోపినాథపురంలో ఓ ఇంట్లో రెండు తులాల బంగారం, సంతబొమ్మాళి మండలం పాతమేఘవరంలో ఆరు తులాల బంగారం, కొత్తూరు మండలం దశరథిపురంలో ఆరు తులాల బంగారం పట్టుకుపోయారు. వీరిందరినీ అరెస్టు చేసి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సత్తాచాటిన టెక్కలి విద్యార్థులు



డిగ్రీ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

టెక్కలి: కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి సదస్సులో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ బుధవారం తెలిపారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ వర్క్‌షాప్ ఆన్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ ఆయుష్ మెడిసిన్ ఫర్ యువర్ ఫ్యూచర్ -2023 సదస్సులో భాగంగా బీఎస్సీ విద్యార్థులు నివేదిత, కుమారి, సరితలు హాజరై సంప్రదాయ మెడికల్ ప్లాంట్స్ ఇన్ టెక్కలి పేరుతో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో విద్యార్థి నివేదితకు బెస్ట్ ప్రెజెంటేషన్ ప్రశంసా పత్రంతో పాటు మిగిలిన విద్యార్థులు కుమారి, సరితలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, చంద్రశేఖర్, ఝాన్సీరాణి, డి.వాసుబాబు పాల్గొన్నారు.

16 సీసీ కెమెరాలు ఉన్నా..

ఆలయంలో భారీ చోరీ

- వెండి కిరీటం, బంగారు ఆభరణాలు, నగదు మాయం
- పరిశీలించిన క్లూస్‌టీం



చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు, క్లూస్ టీం

ఎచ్చెర్ల క్యాంపస్ : ఆలయంలో దొంగలు పడ్డారు. ఎచ్చెర్ల మండల పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న తమ్మినాయుడుపేటలో లలితా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఆలయం ముందు గ్రిల్స్ విరగ్గొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి కిరీటం, ఐదు తులాలు బంగారు అభరణాలు, నగదు అపహరించారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు అర్చకులు శ్రీపాద సురేష్ ఆలయం తెరిచేందుకు రాగా, చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ధర్మకర్త శ్రీనివాసరాజుకు తెలియజేయడంతో ఆయన 100 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారమిచ్చారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కాగా, ఆలయానికి 16 సీసీ కెమెరాలు ఉన్నాయి. అందులో మూడు సీసీ ఫుటేజ్ పరిశీలించగా మంగళవారం అర్ధరాత్రి 1.05 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలకు అనుసంధానంగా ఉన్న కేబుల్ కట్ చేయటంతో పూర్తిస్థాయిలో వీడియో రికార్డింగ్ కాలేదు. గతంలో సైతం వీరు ఆరేడు దొంగతనాల్లో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు



విజేతలతో ఎస్ఈ కృష్ణమూర్తి, అధికారులు

అరసవల్లి: ఇంధన పొదుపు వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 15 నుంచి జిల్లాలో అన్ని డివిజన్ కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయాల్లో ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఇంధన పొదుపు ఆవశ్యకతపై డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈఈలు ఎస్.బయన్నాయుడు, రాజశేఖర్, ఎల్‌సీహెచ్ పాత్రుడు, సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన జిల్లాస్థాయి కౌశల్ పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ విజ్ఞాన మండలి, ఆప్‌కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ పరిధిలో నిర్వహించిన జిల్లాస్థాయి కౌశల్-2023 పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర విద్యాసంస్థలో కౌశల్-2023 పేరిట క్విజ్, పోస్టర్ పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు.

కౌశల్ కోఆర్డినేటర్ వై.రామమోహన్‌ప్రసాద్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలో వెంకటేశ్వర కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తినాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎచ్చెర్ల ప్రిన్సిపాల్ చిట్టిబాబు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బృందాలు ఈ నెల 30న విజయవాడ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

విజేతలు వీరే..

- క్విజ్ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్ సోంపేట, జెడ్పీహెచ్ స్కూల్ బుడితి, జెడ్పీహెచ్ స్కూల్ బోరుభద్ర బృందాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
- జనరల్ పోస్టర్ పోటీల్లో జెడ్పీహెచ్ స్కూల్ వంజంగి, జెడ్పీహెచ్ స్కూల్ సీతాపురం, ఏపీ మోడల్ స్కూల్ ప్రహరాజపురం తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.
- స్పెషల్ పోస్టర్ విభాగంలో జెడ్పీహెచ్ స్కూల్ ఈదులవలస, జీహెచ్ స్కూల్ సంతబొమ్మాళి, జెడ్పీహెచ్ స్కూల్ పాతటెక్కలి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

చాపరలో చిన్నారి కిడ్నాప్ కలకలం



చిన్నారి తల్లి నాగమణి

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారిని ఎత్తుకుపోయినట్లు చిన్నారి తల్లి నాగమణి చెబుతున్నారు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనులు చేసుకుంటున్న సమయంలో చిన్నారిని ఎవరో పిలిచారనీ.. తాను బయటకు వచ్చేలోపే బైక్‌పై చిన్నారితో వేగంగా వెళ్లిపోయారని నాగమణి చెప్పారు. ప్రాథమిక వివరాలు బట్టి కిడ్నాప్‌కు పాల్పడినవారు చిన్నారి తల్లిదండ్రులకు తెలిసిన వారే అయి ఉండవచ్చని పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు చెప్పారు. గ్రామానికి అనుసంధానంగా ఉన్న ముఖ్య కూడళ్లలో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని, దుండగులు విశాఖపట్నంవైపు వెళ్లినట్లు భావిస్తున్నామన్నారు. కాగా, చిన్నారి తండ్రి గంగాధర్ అయ్యప్ప మాలధారణలో శబరిమలై వెళ్లినట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ డైరెక్ట్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Furthier Studies and Abroad. Ph: 83417 74299 [V-796960]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు, సిటికాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-222]

WANTED

■ వైజాగ్‌లో గల ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పనిచేయుటకు 19-35 వయస్సు గల యువతులు కావలెను. జీతం : 10,000/- టూ 14,000/- + ఫుడ్, రూమ్, ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు. ఫోన్: 97046 37370. 99499 04532. ఫీజు లేదు. [V-26460]

■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretakers కావలెను.జీతం:18-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు కలవు. 9381848549 [G-1624]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167557]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221890]

■ శ్రీకాకుళం, నరసన్నపేటలో గల ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పనిచేయుటకు చదువుతో సంబంధం లేకుండా 19-35 వయస్సు గల యువతులు కావలెను. జీతం : 10,000/- టూ 12,000/-. ఫోన్: 91542 96342, 91542 96343. డైరెక్ట్ జాయినింగ్. [V-26462]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 9014885406 [HA-993]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793666]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీకేర్‌టేకర్స్, లేడీనర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12583]

■ ఉద్యోగ అవకాశాలు : వైజాగ్‌లో నూతనంగా ప్రారంభించబోవు మా సంస్థ నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన యువతి, యువకులు కావలెను. పూర్తి వివరాలకు సంప్ర : 79892 80348 [V-6347]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.